ప్రజాశక్తి
సోమవారం 15 జులై 2024
5
విజయనగరం

ఉద్యోగోన్నతుల్లో అవకాశమివ్వాలి

మంత్రికి ఎడ్యుకేషన్ సెక్రటరీల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యాశాఖలో ఉద్యోగోన్నతుల్లో తమకు అవకాశం కల్పించాలని ఎపి వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. ఆదివారం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. పాఠశాలలు, కళాశాలల్లో జూనియర్ అసిస్టెంట్లుగా, కంప్యూటర్ బోధకులుగా అవకాశం కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవన్ కుమార్, జిల్లా అధ్యక్షులు సాయి ప్రేమ్, కార్యవర్గ సభ్యులు కమలాకర్, గిరిధర్, కిరణ్, నవీన్, రవికుమార్ , ప్రవీణ్, కల్యాణి, నాగ శిరీష, సాయి ప్రసన్న, అరుణ శ్రీ, వరలక్ష్మి, రూపాలి పాల్గొన్నారు.

అమ్మకడుపులోంచి బయుకు వచ్చి ఇంకా ఆరు మాసాలు పూర్తికాలేదు. అమ్మ జోలపాట తప్ప మరే గొంతునూ గుర్తుపట్ట లేనంత పసితనం. జోలాలీ.... అంటూ అప్పటి వరకు అమ్మ పాడుతున్న జోలపాటతో నిద్రలోకి జారుకుంటున్న సమయమది. అంతలోనే ఓ మానవ మృగం పైశాచిక దాడికి పాల్పడింది. ఉయ్యాల్లో నిద్రిస్తున్న పాపాయిపై పంజా విసిరింది. వయో భేదం, వావివరుసలు మరిచి మానవ రూపంలో సంచరిస్తున్న ఆ మృగం ఏకంగా అత్యాచారానికి పాల్పడింది. అంతలోనే పాపాయి వద్దకు వచ్చిన తల్లి తల్లడిల్లిపోయింది. ఇంకా తన రక్తపు ముద్దగానే భావిస్తున్న ఆ పాపాయి తీవ్ర రక్తస్రావంతో ఒకటే ఏడుపు. ఆ దృశ్యంతో తల్లి నిర్ఘాంతపోయింది. ఆమె రోదన అంతా ఇంతా కాదు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న ఆ చిన్నారిపై ఇటువంటి అకృత్యం చోటు చేసుకోవడం.. తల్లిగా ఆమెను మాత్రమే కాదు, సగటు మనిషిని కలచివేసింది. ఎంతో మంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామభద్రపురం మండలం కొండకెంగువ పంచాయతీ జీలికవలస గ్రామంలో చోటు చేసుకున్న ఈ సంఘటన సగటు మానవాళి హృదయాలను కలచివేసింది. నేరెళ్లవలస కేంద్రంగా సంచరిస్తున్న ఈ మానవ మృగం అకృత్యాలు వెలుగులోకి వస్తున్నాయి.

నిందితుడు ఎరకన్నదొర

అభం శుభం తెలియని పసికందుపై అత్యాచార ఘటన జిల్లాలో ఆదివారం కలకలం రేకెత్తించింది. రామభద్రపురం మండలం కొండకెంగువ పంచాయతీ పరిధిలోని జీలికవలసలో చోటుచేసుకున్న ఈ ఘటనపై జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. నిందితుడిని కఠిన శిక్షించాలని, వెనువెంటనే చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రామభద్రపురంలో నిరసన చేపట్టారు.

– ప్రజాశక్తి, రామభద్రపురం, బొబ్బిలి, విజయనగరం కోట, టౌన్

పసికందుపై అత్యాచారం దుర్మార్గం

పసికందుపై అత్యాచారం అత్యంత దారుణమైన ఘటనని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి ఎస్.గోపాలం విచారం వ్యక్తంచేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. అశ్లీలత, అసభ్య కరమైన వీడియోలు ఇంటర్నెట్‌లో పెట్టడం, సినిమా, టివి సీరియళ్లలో మహిళలను అసభ్యంగా చూపించడం వల్లే అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మహిళలపై దాడులు, వేధింపులు, అత్యాచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం సభ్యులు బి.యుగంధర్ పాల్గొన్నారు.

నేరెళ్లవలసలో మానవ మృగం

- మహిళలు కనిపిస్తే పైశాచికమే
- తాజాగా పసికందుపై అత్యాచారంతో వెలుగులోకి
- నిర్ఘాంతపోతున్న మానవ లోకం

వెల్లువెత్తిన ఆగ్రహం

ప్రజాశక్తి - విజయనగరంప్రతినిధి / రామభద్రపురం

జీలికవలసలో పసికందుపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు బోయిన ఎరకన్నదొర (40) బయట ఉంటే మహిళలకు భద్రత లేనట్టే లెక్క. కంటికి మనిషిలా కనిపిస్తున్నప్పటికీ కొన్నాళ్లుగా మానవ రూపంలోని మృగంలానే ప్రవర్తిస్తున్నాడని ఆయన స్వగ్రామం నేరెళ్లవలస జనమంతా చెప్పుకుంటున్నారు. ప్రవర్తన బాగా లేకపోవడంతో ఐదేళ్ల క్రితమే భార్య వదిలి వెళ్లిపోయింది. కొడుకును కూడా ఆయన వద్ద ఉంచేందుకు సాహసించలేదు. పూటుగా తాగడం, చిన్న పెద్ద, వావివరసలతో సంబంధం లేకుండా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, వేధించడం ఆయనకు పరిపాటేనట. ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని ఏకంగా ఇళ్లల్లోకి చొరబడిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. కొంతకాలంగా స్థానికంగా ఉన్న బాలికల వసతి గృహం గోడలు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నట్టు స్థానికులు చెప్పుకుంటున్నారు. ఎరకన్న తండ్రి గ్రామ పెద్ద కావడంతో తామేమీ చేయలేకపోతున్నామని కూడా ఆ గ్రామానికి వెళ్లిన విలేకర్ల బృందానికి పలువురు చెప్పారు. కొడుకు చేష్టలకు తండ్రి వంతపాడకపోయినప్పటికీ, పరువు పోతుందనే భయంతో పలు సందర్భాల్లో బాధితుల కాళ్లుపట్టుకుని క్షమాపణ కోరడంతో వ్యవహారాలు పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లడం లేదని సమాచారం.

పెంపకంలోనే లోపం

ఎరకన్న దొర తల్లిదండ్రులు గ్రామంలో పరువుగలిగిన వాళ్లే. కొన్ని దశాబ్దాలుగా గ్రామంలో పెద్దరికం వహిస్తున్నారు. కానీ, తన కొడుకును తగిన రీతిలో పెంచడంలో విఫలమయ్యారు. ఎరకన్నదొరను చదివించేందుకు తల్లిదండ్రులుగా ఎంతో తాపత్రయపడినా సరిగా స్కూల్‌కి వెళ్లేవాడు కాదట. విసుగు చెంది వదిలేయండంతో మహిళలపాలిట మృగంగా మారిపోయాడు. న్యాయం కోసం తన తండ్రి వద్దకు వచ్చిన మహిళలపై కూడా అసభ్యంగా వ్యవహరించేవాడట. ఇటువంటి సందర్భాల్లో తల్లిదండ్రులు ఖండించి గట్టిగా చెప్పడం మినహా దండించలేకపోయారు. కొడుకు పట్ల ఆ మెతక వైఖరే చివరకు నేడు పెద్దరికాన్ని, పరువును తీసేసింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు కొడుకు చేష్టలతో ఖైదుగా మారే పరిస్థితి వచ్చాక తండ్రి.. 'తన కొడుకును అప్పగిస్తే గొడ్డలి వేటుతో చంపేస్తానంటూ పుట్టెడు దు:ఖంతో చెబుతున్నాడు.

అత్యాచార అకృత్యాలకు అడ్డే లేదా?

జిల్లాలో అత్యాచారాలు, అందులోనూ అభం, శుభం తెలియని చిన్నారులపై పైశాచిక చర్యలు అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్నాయి. గడిచిన కొద్ది కాలంలో పరిశీలిస్తే విజయనగరంలోని కణపాక ప్రాంతంలో కన్నతండ్రే కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. భోగాపురంలో ఐదేళ్ల బాలికపై యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎస్.కోటలో తాత మనుమరాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే ప్రాంతంలోని బొడ్డవర మీదుగా నడిచి వస్తున్న బాలికకు బైకు లిఫ్ట్ ఇచ్చినట్టు నమ్మించి, ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి మానవ మృగంగా మారిపోయాడు. ఇంకా వెలుగులోకి రాని సంఘటనలు ఎన్నో. ఇటువంటి సందర్భాల్లో నమోదవుతున్న కేసులపై పాలకులు పారదర్శకంగా వ్యవహరించకపోవడం, రాజకీయ జోక్యాలు పెచ్చుమీరుతుండడం, కేసుల పరిష్కారానికి కాలయాపన చేయడం, నిందితులు అనుభవిస్తున్న శిక్షలు కూడా బయటకు తెలిజేసే విధంగా చర్యలు తీసుకోకపోవడం వంటి వాటి వల్ల పదేపదే ఇటువంటి అకృత్యాలకు అవకాశం కలుగుతోందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల పెంపకంతోపాటు నిందితులపై కఠిన శిక్షలు అమలు చేసే విధంగా ఇటు తల్లిదండ్రులు, అటు ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరించాల్సి ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

మంత్రుల పరామర్శ

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

ఘోషాసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని, ఆమె తల్లిని మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, విజయ నగరం, బొబ్బిలి ఎమ్మెల్యేలు పి.అదితి గజపతిరాజు, బేబినాయన పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి శ్రీనివాస్ చిన్నారి యోగక్షేమాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులతో మాట్లాడారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న మన జిల్లాలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం విచారకరమన్నారు. పసికందుపై ఇలాంటి ఘటనకు పాల్పడం ఎంతో సిగ్గుచేటని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తాం

బాధిత కుటుంబాన్ని గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి పరామర్శించి, భరోసా ఇచ్చారు. శిశువుకు మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం మంత్రి సంధ్యారాణి మీడియాతో మాట్లాడుతూ చట్టపరంగా అందాల్సిన ఆర్థిక సాయాన్ని వెంటనే అందిస్తామన్నారు. నిందితుడిని వీలైనంత త్వరగా, కఠినంగా శిక్షించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కనీసం బెయిల్ కూడా రాకుండా చూడాలని న్యాయవాదులకు ఆమె విజ్ఞప్తిచేశారు. ఆమె వెంట ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, రామభద్రపురం తహశీల్దార్ సులోచనారాణి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ విజయలక్ష్మి ఉన్నారు.

☞ డిఎస్‌పి శ్రీనివాసరావుతో బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడి, సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. నిందితునికి కఠిన శిక్ష పడేలా చూడాలని కోరారు.

జెడ్‌పి చైర్మన్ దిగ్భ్రాంతి

చిన్నారిపై అత్యాచార యత్నం ఘటనపై జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సంఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. బాధిత బాలిక ఆరోగ్య పరిస్థితిపై ఘోషాసుపత్రి వైద్యులు, స్త్రీ శిశు సంక్షేమ అధికారులను ఆయన వాకబు చేశారు. నిండితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్ విచారం

అత్యాచార ఘటనపై ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు విచారం వ్యక్తంచేశారు. సంఘటన వివరాలను, బాధిత బాలిక ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాల్సిందిగా సూచించారు. సభ్య సమాజం తలదించుకునే ఘటనకు పాల్పడిన నిండితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

ఐద్వా ఆధ్వర్యాన నిరసన

పసికందుపై అత్యాచారం చేసిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు పుణ్యవతి ఆధ్వర్యాన రామభద్రపురం సచివాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం పసికందుపై అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిఎస్‌పికి వినతినిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను, ఐద్వా నాయకులు పద్మ పాల్గొన్నారు.

పరామర్శ.. ఘోషాసుపత్రిలో చికిత్స పొందుతున్న పసికందును, తల్లిని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వంజరాపు లక్ష్మి, వేగోటి లక్ష్మి, సహాయ కార్యదర్శి డి.కరుణ పరామర్శించారు. అనంతరం వంజరాజు లక్ష్మి మాట్లాడుతూ పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు అత్యాచారాలు, హత్యలు గత కొంతకాలంగా జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మద్యం, మాదకద్రవ్యాలను అరికట్టకపోవడంతో ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వాలు మారినా అత్యాచారాలు తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హోంమంత్రి అనిత మహిళా రక్షణ చట్టాలపై దృష్టి పెట్టి రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు.

నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు

పలువురి విచారం

- ☞ అత్యాచార ఘటనపై జనసేన నేత గురాన అయ్యలు విచారం వ్యక్తంచేశారు. అమానుషమైన సంఘటనను తీవ్రంగా ఖండించారు.
- ☞ చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ రైట్స్ ఫోరం కన్వీనర్ పి.చిట్టిబాబు ప్రభుత్వాన్ని కోరారు. తల్లిదండ్రులకు, బాలలకు భరోసాను కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై, జిల్లా యంత్రాంగం ఉందని తెలిపారు.
- ☞ నిందితుడిని కఠినంగా శిక్షించాలని మానవ హక్కు సంఘం జిల్లా అధ్యక్షులు సత్తి అచ్చిరెడ్డి.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు.
- ☞ పసికందుపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి ఉరిశిక్ష విధించాలని కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జెసి రాజు డిమాండ్ చేశారు.
- ☞ అత్యాచారానికి గురైన పసికందు కుటుంబ సభ్యులను జనసేన రాష్ట్ర నాయకులు బాబు పాలూరి, మండల అధ్యక్షులు ఎస్.గంగాధర్, జనసైనికులు పరామర్శించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు.

మడ్డువలస నీరు విడుదల

ప్రజాశక్తి-వంగర

మండలంలోని గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా ఆదివారం సాగునీటిని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ విడుదల చేశారు. తొలుత ఆయనకు ప్రాజెక్టు అధికారులు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ప్రాజెక్టు ఇఇ మన్మథరావుతో మాట్లాడి ప్రాజెక్టు స్థితిగతులు, టూరిజం నిర్మాణం, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. తమది రైతుల సంక్షేమ ప్రభుత్వమని, రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మడ్డువలస ప్రాజెక్టు శివారు భూములకు ఖరీఫ్ సీజన్లో పుష్కలంగా సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో డిఇ అర్జున్, ఎఇ నితిన్, టిడిపి సీనియర్ నాయకులు బొత్స వాసుదేవరావునాయుడు, పిన్నింటి మోహనరావు, ఉదయాన మురళీకృష్ణారావు, లచ్చుబుక్త కృష్ణమూర్తి బెజ్జిపురం త్రినాథరావు, రవి, గణపతి పాల్గొన్నారు.

ప్రాజెక్టు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కార్యవర్గం ; ప్లీనరీలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి డిమాండ్

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక లోకబందు రెసిడెన్సీలో నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీ రెండోరోజు ఆదివారం కొనసాగింది. ఈసందర్భంగా కె.విజయగౌరి మాట్లాడుతూ విద్యారంగంలో బొబ్బిలి అభివృద్ధి చెందుతున్నా, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎయిడెడ్ కళాశాలగా ఉన్న రాజా కళాశాలలను ప్రయివేట్ యాజమాన్యానికి అప్పగించడంతో ఫీజులు కట్టుకుని చదవలేక పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిరిడిలో ప్లస్-2 పేరుతో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారంటే పాలకులకు విద్యారంగం పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. రామ్మోహన్ మాట్లాడుతూ నీట్ ప్రశ్నపత్రాల లీకేజీపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నీట్ స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ పలు తీర్మానాలను ఆమోదించింది. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్, ఉపాధ్యక్షులు జె.రవికుమార్, వెంకీ, చినబాబు, సహాయ కార్యదర్శులు సమీరా, హరికృష్ణ, జగదీష్, మణికుమార్, పి.రమేష్, కె.రమేష్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా డి.రాము, సిహెచ్ వెంకటేష్, ఉపాధ్యక్షులుగా జె.రవికుమార్, వెంకీ, చినబాబు, సహాయ కార్యదర్శులుగా సమీరా, హరికృష్ణ, జగదీష్, మణికుమార్, పి.రమేష్, కె.రమేష్, శిరీషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహిళాభ్యున్నతికి ఎస్‌హెచ్‌జిలు దోహదం

స్త్రీనిధి రుణాల లక్ష్యం రూ.200 కోట్లు ● 'ప్రజాశక్తి'తో డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం కోట

'ఇంటికి దీపం ఇల్లాలు అంటారు. అటువంటి ఇల్లాలు పురోగతి చెందితే ఆ ఇంట్లి అభ్యున్నతికి ఎంతో తోడ్పడుతుంది. నేడు మహిళలు అన్ని రంగాల్లో కీలకమైన పాత్ర పోషిస్తూ వస్తున్నారు. అటువంటి మహిళలకు రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాల్లోనూ వారికి ప్రత్యేకమైన కోటాను కేటాయిస్తూ వస్తున్నాయి. అందులో ప్రధానంగా అక్షరాస్యతతో సంబంధం లేకుండా ప్రతి మహిళా అభివృద్ధి చెందాలని సదుద్దేశంతో ప్రభుత్వాలు మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జి)ను ఏర్పాటు చేశాయి. వాటి ద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నాయి. మహిళలకు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల మంజూరుతో స్వయం ఉపాధికి బీజం వేసి, ఆర్థికాభివృద్ధి చెందేలా ప్రోత్సాహం అందిస్తున్నామ'ని డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి వివరించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

జిల్లాలో ఎన్ని స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి.?

ప్రస్తుతం జిల్లాలో 46 వేల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా గ్రూపులు) ఉన్నాయి. ఇందులో 4.50 లక్షల మంది సభ్యులున్నారు. ఈ సంఘాల ఖాతాల్లో రూ.637 కోట్లు నగదు ఉంది.

స్త్రీనిధి రుణాల లక్ష్యం, వసూళ్లు ఎలా ఉన్నాయి.?

స్త్రీ నిధి ద్వారా రుణాలు తీసుకునే వారు 24 వాయిదాలలో అంటే, రెండేళ్లలో తిరిగి చెల్లించాలి. ఇందుకు 2023-24 సంవత్సరానికి గాను రూ.200 కోట్లు మంజూరు చేశాం. రుణాల రికవరీ 99.5 శాతంగా ఉంది. మిగిలినవి చిన్న చిన్న సమస్యల కారణంగా ఆగాయి. వాటినీ వసూళు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.200 కోట్లు స్త్రీ నిధి రుణాలు మంజూరు చేయడానికి లక్ష్యంగా పెట్టుకొన్నాం.

మహిళా మార్టుల నిర్వహణ ఎలా ఉంది.?

మహిళా మార్టుల ఏర్పాటు కోసం ప్రతి గ్రూపు సభ్యురాలి నుంచి రూ.310 చొప్పున వసూలు చేశాం. ఇలా జిల్లా వ్యాప్తంగా రూ.9.10 కోట్లు సేకరించాం. ప్రస్తుతానికి స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యాన జిల్లాలో శృంగవరపుకోట, గరివిడిలో మహిళా మార్టులను ప్రారంభించాం. గరివిడిలో 16 వేల మందితో రూ.48 లక్షలతో డిపార్ట్‌మెంటల్ స్టోర్‌ను ప్రారంభించాం.

ఎస్‌హెచ్‌జిల బలోపేతానికి తీసుకుంటున్న చర్యలేమిటి.?

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రతి మహిళలో చైతన్యం రావడానికి గ్రామ, మండల స్థాయిల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. వాటి ద్వారా బలోపేతానికి కృషి చేస్తున్నాం. మహిళల అభివృద్ధికి అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయి. ఆ పథకాలను బ్యాంకులకు అనుసంధానిస్తున్నాం. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ప్రోగ్రాం ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నాం. 2023-24లో 760 యూనిట్లు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేశారు.

నైపుణ్యాభివృద్ధి ద్వారా ఏయే రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు.?

ప్రతి జిల్లాకు నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఒకటి ఉంటుంది. దీనికి జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. దీంతోపాటు అన్ని శాఖల సమన్వయంతో డిఆర్‌డిఎ ముందుకు తీసుకువెళ్తుంది. డిడియు - జికెవై, ఎస్‌ఆర్‌టిపి ద్వారా ఫార్మాసెక్టార్లో బిఎస్‌సి కెమిస్ట్రీ పూర్తి చేసిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. పిఐఎ ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి వారు ఎంచుకున్న రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. పిఐఎ కేంద్రాలు కెఎల్‌పురం, పూల్‌బాగ్ ప్రాంతాల్లో ఉన్నాయి. బొబ్బిలి, సెంచూరియన్ యూనివర్సిటీలో యువతకు శిక్షణ ఇవ్వడానికి వీటిని ఏర్పాటుచేశాం. ఎపిఎస్‌డిసి ద్వారా ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటుచేసి, శిక్షణ పూర్తిచేశాక ఉద్యోగాలు కల్పిస్తాం.

వేపాడ మండలంలో అవకతవకలపై ఆరోపణలు వచ్చాయి. ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?

మా విచారణలో వేపాడ మండలంలో అవకతవకలు జరిగినట్లు తేలింది. అది రూ.13 లక్షలుగా లెక్క వచ్చింది. కొంత అమౌంట్‌ను లెక్క చూపించారు. మిగతా దానిపై సభ్యులు విచారణ చేపడతారు. త్వరలోనే దానిపై ఒక క్లారిటీ ఇస్తాం. ప్రస్తుతానికి ఎపిఎంను సస్పెండ్ చేశాం.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయి 17వ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు ప్రారంభించారు. ఆదివారం నగరంలోని తోటపాలెంలో గాయత్రి విద్యా సంస్థలలో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు జీవితంలో భాగం కావాలన్నారు. ఆత్మరక్షణతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, మానసిక ధైర్యం ఏర్పడతాయన్నారు. తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు మాట్లాడుతూ పోటీలకు 170 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. విజేతలను అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు.

అనంతరం విజేతలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సతీమణి సింధు, తైక్వాండో అసోసియేషన్ చైర్మన్, కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, సిహెచ్ వేణుగోపాలరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

బహుమతి అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

కట్టి పడేసిన కథాసంధి

మాట్లాడుతున్న గంటేడ గౌరునాయుడు

విజయనగరం కోట: సుప్రసిద్ధ రచయిత గంటేడ గౌరునాయుడు చదివిన కథ శ్రోతలను కట్టి పడేసింది. ఆదివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సమావేశ మందిరంలో సాహిత్య అకాడమీ సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో కథాసంధి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రముఖ గజల్ వినోద్ గౌరునాయుడు రచించిన గేయాలను తమ గజల్తో శ్రోతలను అలరించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ గౌరు నాయుడును పరిచయం చేస్తూ ఆయన సాహిత్య జీవితం 1980లో శారద పెళ్లి, ఏటి పాట, ఒక రాత్రి రెండు స్వప్నాలు కథలు సంపుటితో మొదలైందన్నారు. కవిత్వం నాగలికొన్న, అనువాద గీతాంజలి తోను చేస్తారన్నారు. పాదయాత్ర స్వేచ్ఛా గీతం గేయంతో ప్రపంచానికి పరిచయం అయ్యామన్నారు. బహుముఖ ప్రజ్ఞశాలి అని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు చింతకింది శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయన్ని ప్రపంచం గుర్తించిందన్నారు. అనంతరం కథాసంధిలో భాగంగా గంటేడ గౌరునాయుడు లాబేసు-పూర్ణ పాడు ఒక సంపూర్ణ వంతెన అనే తన కథను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గుజ్జంగిరాజు, ధనుంజయ్, జి.ఎస్.చలం, బాబు, సుభద్ర, గోపాలరావు, చింతాడ అప్పలనాయుడు, పక్కీ రవీంద్ర, దాసు, పాయల మురళీకృష్ణ, జుజ్జు రామకృష్ణ, చీకటి చంద్రిక రాణి, స్వామి నాయుడు, గాయకులు, కవులు, సాహిత్య వేత్తలు, రచయితలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఆర్పిలు

ఆర్పిల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ మెప్మా ఆర్పిల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవికి ఆదివారం తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్పిలు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా వేతనాలు సారిగా అందలేదని వేతన సవరణ కూడా చేయలేదని వివరించారు. కాల పరిమితి తగ్గించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆర్పిలు ఉన్నారు.

లైట్ మోటారు వెహికల్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక

బొబ్బిలి: స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయ మండపంలో ఆదివారం లైట్ మోటారు వెహికల్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. సమావేశంలో నూతన కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.వెంకటరమణ, కార్యదర్శిగా టి.ఆనంద్, ఉపాధ్యక్షులుగా ఎన్.గోపి, సహాయ కార్యదర్శిగా ఎం.శివ, కోశాధికారిగా ఎ.సూర్యారావును మరో 9 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోటారు కార్మికుల సమస్యలు పరిష్కారానికి పని చేస్తామని నూతన కమిటీ సభ్యులు చెప్పారు. సమావేశంలో మోటారు కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా వారాల పండగ

బాడంగి: మండలంలోని ఎరుకుల పాకాల, వీరసాగరం, తెంటువలస, లక్ష్మీపురం గ్రామాల్లో ఆదివారం వారాలు పండగ ఘనంగా జరిపారు. లక్ష్మీపురం పంచాయతీ ఎరుకలపాకలు గ్రామంలో దేశమ్మతల్లి వారాలను సర్పంచ్ పాలవలస పార్వతి, ఎంపిటిసి పాలవలస గౌరు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు సిఎం అయిన సందర్భంగా గ్రామంలోని 120 కుటుంబాలు పెద్ద ఎత్తున దేశమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంతకాలం తమ గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని ఇక నుంచి చంద్రబాబు హయాంలో తమ గ్రామానికి ప్రజలకు మంచి రోజులు రావాలని మొక్కు చెల్లించినట్లు గౌరు తెలిపారు.

మంత్రిని కలిసిన ఆర్య వైశ్య సంఘ నాయకులు

బాడంగి: విజయనగరంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ను శ్రీకాకుళం విజయనగరం జిల్లాల ఆర్య వైశ్య సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. టిడిపి వాణిజ్య విభాగం కార్యదర్శి, ఆర్యవైశ్య రాష్ట్ర కార్యదర్శి అడ్డా గోవిందరాజు, ఆర్యవైశ్య విజయనగరం జిల్లా అధ్యక్షులు పూసర్ల మోహన్ రావు, ఆంధ్రప్రదేశ్ రేషన్ షాపుల అసోసియేషన్ ఉపాధ్యక్షులు తవ్వ మోహన్రావు, ఆర్యవైశ్య ప్రముఖులు ఎవి. రామకృష్ణ, కొత్తవలస నాయకులు నాగరాజు కలిసి వ్యాపార రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

రెడ్ క్రాస్ కార్యకలాపాలు విస్తరించాలి

శృంగవరపుకోట: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎస్.కోట బ్రాంచ్ కార్యకలాపాలు విస్తరించాలని బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ పి.వరలక్ష్మి అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ముఖ్య సమావేశం పట్టణంలోని ఒక ప్రైవేటు హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ చేపట్టనున్న కార్యక్రమాలను సంస్థ సిద్ధాంతాలను యూత్ రెడ్ క్రాస్ జూనియర్ అడ్రస్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలో, కాలేజీలలో అవగాహన సదస్సులు పెట్టాలన్నారు. బ్రాంచ్ కార్యకలాపాలు పట్టణంలో నిర్వహించడానికి కార్యాలయ గదిని ఏర్పాటు చేయమని కోరుతూ తహశీల్దార్కు దరఖాస్తు చేయాలని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ సహకారంతో విరివిగా చేపట్టాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విజయనగరం జిల్లా ఎంసి మెంబర్ దొడ్డి సూర్యారావు, ఎస్కోట సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ వైస్ చైర్మన్ మల్లేశ్వరరావు, కార్యదర్శి జి ధనుంజయ్, జూనియర్ రెడ్ క్రాస్ మెంబర్స్ వి లోకేష్, ఎం మురళి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చొల్లంగిపేట గ్రామానికి చెందిన వివాహిత ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన ఉత్తాడ జయలక్ష్మికి (21) రెండు సంవత్సరాల క్రితం విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన వ్యక్తితో వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు కారణంగా జయలక్ష్మి తన కన్నవారి ఇంటి దగ్గర చల్లంగిపేటలో ఉంటుంది. తనను భర్త ఎప్పటికీ కాపురానికి తీసుకువెళ్లక పోవడంతో మనస్థాపం చెంది ఇంట్లోని ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని మృతి చెందింది. బయటికి వెళ్లిన తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి ఫ్యాన్కు ఉరివేసుకొని వేలాడ ఉండటంతో చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని వల్లూరు జంక్షన్ వద్ద లారీ ఢీ కొని సతివాడ గ్రామానికి చెందిన చందక శారధ(45) ఆదివారం మృతి చెందింది. రణస్థలం మండలం గిరివానిపాలెం వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఆమెను నెల్లిమర్ల నుంచి వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తలకు గాయమై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధుడు అదృశ్యంపై కేసు నమోదు

శృంగవరపుకోట: పట్టణంలోని ఎస్సి కాలనీకి చెందిన గంటా కేశవ్ (62) ఈ నెల 1వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని కుమారుడు గంట శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టివి రమణ తెలిపారు. వృద్ధుడికి చాలా కాలంగా అనారోగ్య కారణాల వల్ల మతిస్థిమితం కూడా లేదని అతని కుమారుడు తెలిపారన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని తాటిపూడి రిజర్వాయర్లో ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని గంట్యాడ ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు. విఆర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని బయటకు తీసి విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు గంట్యాడ పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని ఆయన కోరారు.

చక్కెర ఫ్యాక్టరీపై చేదు మాట

'భీమసింగి సుగర్స్ తెరిచినా నష్టాలే. విదేశాల నుంచి పంచదార కారు చవకగా దిగుమతి కావడంతో చెరుకు పరిశ్రమ నష్టపోతుంది. భీమసింగి మూతబడిన కారణంగా, ఫ్యాక్టరీ మొత్తం తీసేయ్యాలని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఆధునీకరణ చేసే ఫ్యాక్టరీ నడిపినా, నష్టాలు తప్పా, లాభం లేదు. కాబట్టి దాని స్థానంలో ఎటువంటి ఇండస్ట్రీ పెట్టాలన్న దానిపై ఆలోచన చేస్తున్నాం'

- లొట్లపల్లి సభలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

- చెరకు లేదని ఒకరు.. ఫ్యాక్టరీ నష్టమని మరొకరు..
- భీమసింగిపై టిడిపి, వైసిపి దొందూ దొందే
- తెరవడం సాధ్యం కాదంటున్న మంత్రి శ్రీనివాస్
- కొండపల్లి మాటలతో భీమసింగి ఖతమని తేటతెల్లం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వామపక్షాలు, రైతు సంఘం

ప్రజాశక్తి - జామి

భీమసింగి సహకార చక్కెర కర్మాగారం శాశ్వతంగా మూతబడటం ఖాయమన్న విషయం మంత్రి మాటలతో తేటతెల్లమైంది. నిన్నటి వరకు ఫ్యాక్టరీని మూసేసిన పాపం వైసిపి ప్రభుత్వానిదే అని టిడిపి నాయకులు మాట్లాడిన విషయం తెలిసిందే. తాము అధికారంలోకి వస్తే, ఫ్యాక్టరీని తెరిపిస్తామని జిల్లాలో ఎమ్మెల్యేలు సెలవిచ్చారు. అధికారం వచ్చి, పదవులు వచ్చాక, గత పాలకుల మాటలనే చెబుతున్నారని వామపక్షాలు, రైతు సంఘాలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సహకార చక్కెర కర్మాగారాలు ప్రభుత్వ విధానాల ఫలితంగా, పాలకుల్లో చిత్తశుద్ధి కొరవడిన కారణంగా మూతబడుతున్నాయి. ప్రధానంగా వైసిపి ప్రభుత్వం ఫ్యాక్టరీని తెరిపించడం పట్ల చిత్తశుద్ధి చూపకపోగా, నెపాన్ని రైతులపైకి నెడుతూ సరిగా సరిపడా చెరుకు లేకపోవడం వల్లే ఫ్యాక్టరీ నడవడం లేదని చెప్పుకొచ్చారు. వాస్తవానికి జిల్లాలో ఉన్న ఒక్కగానొక్క భీమసింగి షుగర్స్ నడవడానికి సరిపడా చెరుకు లభ్యమవుతోంది. తాజాగా మంత్రి మాట్లాడుతూ, చెరుకు ఫ్యాక్టరీలే నష్టమని చెప్పుకొచ్చారు. మొత్తానికి చెరకు పరిశ్రమను నిలబెట్టడంలో ఇటు వైసిపి, అటు టిడిపి రెండు పార్టీలూ దొందు దొందే అని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఆధునీకరణతో ఫ్యాక్టరీ మనుగడ, ఉపాధి

వాస్తవానికి సహకార ఫ్యాక్టరీలన్నీ 70 శాతం క్రమంగాలు కుప్పకూలిపోయాయి. జిల్లాలో భీమసింగి సహకార ఫ్యాక్టరీ ఒకప్పుడు 1.60 లక్షల టన్నులు క్రషింగ్ చేయగా, ప్రస్తుతం 30 వేల టన్నులు కూడా లభ్యం కాదని అధికారులు సెలవిస్తున్నారు. ఆధునీకరణ చేస్తామన్న పేరుతో క్రషింగ్ను ఆపేసిన వైసిపి ప్రభుత్వం పూర్తిగా ఫ్యాక్టరీని మూసేసిన పరిస్థితి. సహకార ఫ్యాక్టరీలను బాగు చేసేందుకు అనేక అవకాశాలున్నాయి. ప్రధానంగా సహకార ఫ్యాక్టరీలన్నీ పురాతనమైనవి కావడంతో ముందుగా యంత్రాలను ఆధునీకరించాలి. ఒక్క చెరకు మీద ఆధారపడకుండా, బయో ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లు నెలకొల్పడం సాధ్యమవుతుంది. దీనికి సుమారుగా రూ.10 కోట్ల నుంచి 15 కోట్లు అవసరం ఉంటుందని గతంలో అంచనా. అయితే ఆ ఖర్చు ప్రస్తుతం పెరగొచ్చు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆధునీకరణ చేయవచ్చని నిపుణులు అంటున్నారు.

భీమసింగి ఈ ప్రాంత కల్పవృక్షం

భీమసింగి షుగర్స్ వల్లనే రెండు జిల్లాల్లో 14 మండలాల్లో రైతాంగ కుటుంబాలు అభివృద్ధి చెందాయి. వ్యవసాయం నష్టం వస్తున్న తరుణంలో చెరకు రైతుకు లాభదాయకం. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాంత రైతు కుటుంబాలు అభివృద్ధి చెందాయి. పిల్లలను ఉన్నత చదువులు చదివించడంలో ముందున్నాయి. కాబట్టి ఫ్యాక్టరీ తీసేసి, ఏ పరిశ్రమ పెట్టినా, వ్యవసాయ ఆధారంగా ఉన్న రైతు కుటుంబాలకు తగిన మేలు చేయలేరు. ఇప్పటికైనా, ఈ ప్రాంత అకాంక్ష అయిన భీమసింగి షుగర్స్ను బతికించే చర్యలు తెసుకోవాలని చెరకు రైతులు ఆకాంక్ష.

మంత్రిగారూ... వీటిపై దృష్టి సారించాలి

రాష్ట్రంలో చక్కెర పాలసీని రూపొందించాలి. ఇతర దేశాల నుంచి పంచదార కారు చవకగా దిగుమతి అవుతున్న నేపథ్యంలో దేశీయ ఫ్యాక్టరీలను నిలబెట్టుకునే దిశగా దిగుమతి సుంకాలు విధించాలి. టిడిపి ఎన్డిఎలో భాగస్వామి కాబట్టి, ఇది కష్టమైన పని కాదు. అలాగే ఫ్యాక్టరీల్లో సరాసరి క్రషింగ్ రికవరీ ఆధారంగా చెరుకు గిట్టుబాటు ధర ప్రకటిస్తారు. 10.25 శాతం రికవరీ కేంద్ర ప్రభుత్వం చెరకు మద్దతు ధర ప్రకటిస్తుంది. కానీ మన ఫ్యాక్టరీలు 9.5 శాతం రికవరీ సాధిస్తున్నాయి. దీని ప్రకారం మన ఫ్యాక్టరీల్లో టన్నుకు రూ.2700 ధర చెల్లిస్తున్నారు. పొరుగు రాష్ట్రల్లో ప్రభుత్వ సలహా ధర ఇస్తున్నాయి. 2002లో చంద్రబాబు ప్రభుత్వమే స్టేట్ సలహా ధరకు మంగళం పాడిన విషయం తెలిసిందే. దీంతో చెరకు పండించిన రైతుకు గిట్టుబాటు కావడం లేదు. మరో వైపు దిగుబడి ఇచ్చే నూతన వంగడాలు రైతుకు అందించాలి. అది జరగాలంటే పరిశోధనా కేంద్రాలుండాలి. కానీ అనకాపల్లి పరిశోధన కేంద్రాన్నే మూసేసిన పరిస్థితి. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో 29 ఫ్యాక్టరీలకు 25 మూత పడిన దుస్థితి. కాబట్టీ ఇప్పటికైనా ఎన్డిఎ కూటమితో ఉన్న టిడిపి ప్రభుత్వం వీటిపై ఒక నిపుణుల కమిటీని వేసి, చక్కెర విధానాన్ని రూపొందిస్తే, సహకార ఫ్యాక్టరీలను కాపాడుకోవడం సాధ్యమే అని రైతు సంఘాలు చెబుతున్నాయి.

భీమసింగి చక్కెర ఫ్యాక్టరీ

మంత్రి మాటలు దురదృష్టకరం

విజయనగరం టౌన్: జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం జామి మండలం లొట్లపల్లి బహిరంగ సభలో రైతులు భీమసింగి సుఘర్ ఫ్యాక్టరీని తెరిపించాలని కోరినా, ఆదునీకరణ సాధ్యం కాదని తేల్చి చెప్పడం దురదృష్టకరమని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. లోకేష్ పాదయాత్రలో సహకార సుగర్ ఫ్యాక్టరీలను ఆదుకుంటామని ఇచ్చిన హామీ తరువాత కూడా ఈ ప్రకటన చేయడం కూటమి ప్రభుత్వం చెరుకు రైతులను మోసగించటమే అవుతుందన్నారు. మంత్రి విదేశాలు నుంచి పంచదార తక్కువకు దిగుమతి అవుతున్నందున మన ఫ్యాక్టరీలో తయారయ్యే పంచదార ధర ఎక్కువ అవ్వటం వల్ల లాభం రాదని, అందువల్ల ఫ్యాక్టరీ నడపటం సాధ్యం కాదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో వున్న ఎన్డిఎ ప్రభుత్వం విదేశీ చక్కెరపై దిగుమతి సుంకం తగ్గించటం వల్ల మన చక్కెర కర్మాగారాలు నష్టాలకు కారణమనే విషయం తెలుసుకోవాలన్నారు. మన ప్రభుత్వాలు చక్కెర ఫాక్టరీలు లాభాలలోకి తీసుకొని వచ్చి, చెరుకు రైతులను ఆదుకొనే దానికి చెక్కర పాలసీ లేదన్నారు. ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలలో చెరుకు విస్తీర్ణం పెరుగుతుందని, అక్కడ టన్ను చెరుకుకు రూ. 3700 ఇవ్వగలుగుతున్నారని చెప్పారు. పరిశోధన కేంద్రాలకు తగు నిధులు ఇచ్చి చెరుకు అధిక దిగుబడి ఇచ్చే ఆదునిక వంగడాలు రైతులకు అందించి, రాష్ట్ర ప్రభుత్వ సలహా ధర ఇస్తే చెరుకు పంట పెరిగి ఫ్యాక్టరీలు లాభాలు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. మన ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 10వేల ఎకరాలలో చెరుకు పంట 2లక్షల టన్నుల ఉందని, ఈ సహకార ఫ్యాక్టరీని ఆదునీకరించి జిల్లాలో వున్న ఒక్క వ్యవసాయ ఆధారిత పరిశ్రమను జిల్లా చెరుకు రైతులను ఆదుకొనేదానికి మంత్రి కృషి చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ తరుపున కోరుతున్నామన్నారు.

గ్రీన్ఫీల్డ్ హైవేతో బతుకు నాశనం

- రోడ్డు పై బైఠాయించి జన్నివలస రైతుల ధర్నా
- అధికారుల హామీతో వెనక్కి

ప్రజాశక్తి - జామి

విశాఖ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంతో వ్యవసాయ బతుకులన్నీ నాశనం అయ్యాయని జన్నివలస రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిపై రైతులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడితూ గ్రామం నుంచి వ్యవసాయ భూములకు వెళ్ళటానికి సరైన రహదారి లేకపోవడం, హైవేపై (ఎంబిసిబి) బలమైన రేకులు ఫిట్ చెయ్యడం వల్ల రోడ్ దాటలేక పడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రోడ్ నిర్మించిన సమయంలో అందరికీ అవసరమైన విధంగా రహదారి నిర్మిస్తామని అధికారులు చెప్పారని, కానీ సర్వీసు రోడ్లు లేకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా రోడ్డు వెలుపల భూములకు వెళ్లడం ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో వ్యవసాయం చేయడం కుదరదని, ఇప్పటికే పలుమార్లు మండల స్థాయి అధికారులను కలిసినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ రైతులంతా ధర్నాకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది రోడ్ నిర్వహణ అధికారులు సంఘటన స్థలానికి వచ్చి తాత్కాలికంగా దారి కోసం ఈ రేకులు తొలగిస్తామని మిగిలిన పనులు త్వరలో చేస్తామని చెప్పారు. వారు చెప్పినట్టు వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే మరల ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని రైతులు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి చంద్రునాయుడు, గ్రామ పెద్దలు సిరపరపు రామారావు, వర్రి శ్రీను, దరిమిరెడ్డి పైడితల్లి, జెవివిఎస్ఎస్ ఈశ్వరరావు, బోడబల్ల రామకృష్ణ, దరిమిరెడ్డి లక్ష్మునాయుడు, ఉప్పాడ శివ, బోడబల్ల చిన్న అప్పారావు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించిన రైతులు

డిసిబగా ఫ్లోరెన్స్

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కు నాయుడుపేట బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో ప్రిన్సిపాల్గా విధులు నిర్వహిస్తున్న టి.ఎం. ఫ్లోరెన్స్ జిల్లా గురుకుల బాలికల వసతి గృహాల కోఆర్డినేటర్గా నియామకమయ్యారు. దీంతో వసతిగృహంలో పనిచేస్తున్న సిబ్బంది, విద్యార్థులు ఆదివారం ఆమెను అభినందించారు. ఇంతవరకు జిల్లా కోఆర్డినేటర్గా బాధ్యతలు చేపట్టిన పద్మజను చిత్తూరు జిల్లా కోఆర్డినేటర్గా బదిలీ చేశారు. ప్రస్తుతం ఇంచార్జి ప్రిన్సిపాల్గా పనిచేస్తున్న ఉషారాణిని వేపాడ బాలికల గురుకుల పాఠశాలకు ప్రిన్సిపాల్గా నియమించారు.

గుండెపోటుతో హెచ్ఎం మృతి

ప్రజాశక్తి- గరివిడి

మండలంలోని తాటిగూడ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న పాణంగి పల్లి మధుసూదన్ (55) గుండెపోటుతో మృతి చెందారు. రెండు రోజులు క్రితం గుండెపోటు వస్తే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విజయనగరంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన ఆదివారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల సహచర సిబ్బంది, యుటిఎఫ్ నాయకులు, రాజకీయ నాయకులు, విద్యాశాఖ అధికారులు నివాళు లర్పించారు. కాగా ఆయన భార్య కూడా ఉపాధ్యాయ వృత్తిలో ఉండగా వారికి ఇద్దరు ఆడపిల్లలున్నారు.

ఆర్టిసిలో కార్మికుల పాత్ర కీలకం

ఎన్ఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆర్టిసి అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల హక్కుల సాధనకు కృషి చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని బొడ్డవర వద్ద ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాఫిల్ అధ్యక్షతన నిర్వహించిన ఎస్కోట, విజయనగరం డిపోల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టిసి ఉన్నతాధికారులు కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఎన్ఎంయు కీలకపాత్ర పోషిస్తుందని అందులో భాగంగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నూతనంగా ఎన్నికైన రాష్ట్ర రవాణా శాఖ మంత్రికి నివేదించామని గుర్తు చేశారు. పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని, ప్రతి సంవత్సరం 4వేల కొత్త బస్సులు ప్రవేశపెట్టాలని, గత ప్రభుత్వం 2019 నుంచి ఆర్టిసి రిక్రూట్మెంట్ నిలుపుదల చేసిందని చెప్పారు. రాష్ట్రంలో 11 వేల డ్రైవర్లు, 5 వేల కండక్టర్ ఉద్యోగాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్లో భాగంగా ఆర్టిసిలో కూడా ఉద్యోగాలను ప్రకటించాలని కోరారు. ఎన్నికల హామీలో భాగంగా మహిళలకు ఫ్రీ బస్సుకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల వలె ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే బస్సుల సంఖ్య పెంచాలన్నారు. ఎస్.కోట డిపోకి సంబంధించి ఉన్న బస్సులలో 90 శాతం చాలా పాత బస్సులను నడుపుతున్నారని వీటి స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ చేసి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, రాష్ట్ర కోశాధికారి మోహన్, రాష్ట్ర నాయకులు రామారావు, నర్సింగరావు, జోనల్ ప్రెసిడెంట్ ప్రదీప్ కుమార్, జోనల్ సెక్రెటరీ ఎంవిఆర్ మూర్తి, జిల్లా సెక్రెటరీ రాములు, ఎస్కోట డిపో అధ్యక్షులు జివి రమణ, కార్యదర్శి అంజయ్య, విజయనగరం, పార్వతీపురం, విశాఖపట్నం డిపోల యూనియన్ నాయకులు ఆర్టిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే గెజిట్ ప్రకటనను రద్దు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

జిపిఎస్ అమలు చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయటం మోసపురితమైన, దుర్మార్గమైన చర్య అని తక్షణమే గెజిట్ ప్రకటనను రద్దు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గాంధీ బొమ్మ కూడలిలో జిపిఎస్ అమలకు, నోటిఫికేషన్ విడుదలకు వ్యతిరేకంగా ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు సిహెచ్.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి గెజిట్ ప్రతులను దగ్ధం చేశారు. గెజిట్ ప్రకటన రద్దుచేయాలని, సిపిఎస్, జిపిఎస్లను రద్దు చేయాలని, పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం జెసి రాజు మాట్లాడుతూ పాత పింఛనను పునరుద్ధరించాలని అది ఉద్యోగ, ఉపాధ్యాయల ఆకాంక్ష అని అన్నారు. గత ప్రభుత్వం జిపిఎస్ను అమలు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నం చేసిందని అయితే పోరాటాల ద్వారా జిఒ విడుదల కాకుండా అడ్డుకున్నామన్నారు. ఇప్పుడు జిపిఎస్ అమలు చేస్తూ గెజిట్ విడుదల చేయటం దుర్మార్గమని, ఇది ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసపుచ్చుటమేనని అన్నారు. తక్షణమే గెజిటను రద్దు చేసి ఒపిఎస్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య, జిల్లా కార్యదర్శి సింహాచలం, ఎపిటిఎఫ్ నాయకులు రామకృష్ణ, లక్ష్మణరావు, జనార్ధనరావు, పరుసు నాయుడు, పాల్గొన్నారు.

జగన్పై అక్రమ కేసు అన్యాయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టిడిపి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అక్రమ కేసు పెట్టడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అప్పానేజ ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రఘురామకష్ణంరాజు కస్టడీ హింసకు సంబంధించి తాజాగా జగన్పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ కేసు ముగిసిన అంశమని దీనిపై గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని అయినప్పటికీ మూడేళ్ల తరువాత మళ్లీ రఘురామరాజు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేయడం అన్యాయమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ముందు వెంటనే అమలు చేయాలని కక్ష పూరితమైన రాజకీయాలు మానుకోవాలని ఆయన తెలిపారు. సమావేశంలో జెడ్పిటిసి వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి వెంకటరమణ, సర్పంచ్ వెంకటరావు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

డెంకాడ: వైసిపి హయాంలో మోపాడ పంచాయతిలోని ప్రభుత్వ వైద్యశాల దగ్గర అక్రమంగా నిర్మించిన పశువుల షెడ్ను ఆదివారం అధికారులు తొలగించారు. ఇటీవల జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఈ షెడ్డు గురించి ఆరా తీయడంతో కలెక్టర్ ఆధ్వర్యంలో తొలగించారు.

బ్రాహ్మణ సమాఖ్య సమావేశం

గజపతినగరం: మండలంలోని బోడసింగిపేటలోని ఒక ప్రయివేటు ఫంక్షన్ హాల్లో ఆదివారం గజపతినగరం వేద గాయత్రి బ్రాహ్మణ సమాఖ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భవిష్యత్లో బ్రాహ్మణులపై ఎటువంటి సంఘటనలు జరిగినా ఐక్యంగా నిలబడి పోరాటం చేయాలని తీర్మానించామన్నారు. ఇటీవల పార్వతీపురం సమీపంలో గల పైలా దాస్ బ్రాహ్మణులను కించపరిచేలా పోస్టులు పెట్టడం పట్ల తీవ్రంగా ఖండించారు. భవిష్యత్లో ఇటువంటి సంఘటనలు జరగకుండా బ్రాహ్మణులు సమైక్యంగా మెలిగి పోరాడాలన్నారు.

ముగిసిన సిబ్బంది అభివృద్ధి కార్యక్రమం

డెంకాడ: ఎంవిజిఆర్ డేటా ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సిబ్బంది అభివృద్ధి కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. 'ఇంటెలిజెంట్ సైబర్-ఫిజికల్ సిస్టమ్స్, బ్లాక్చెయిన్ టెక్నాలజీ తాజా ట్రెండ్స్, అప్లికేషన్స్ పై వారం రోజులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో ఎంవిజిఆర్ ఐక్యూఏసి కన్వీనర్ డాక్టర్ వి.నాగేశ్ పాల్గొని మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు సిబ్బంది అభివృద్ధికి దోహదపడతాయన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికేట్లును అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టిటిపి కన్వీనర్ డాక్టర్ పి. శ్రీనివాసరావు, ఎంవిజిఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రమేష్, డైరెక్టర్ ప్రొఫెసర్ పి. ఎస్. సీతారామరాజు, డాక్టర్ పి. సతీష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

మెరక ముడిదాం: మండలంలోని బైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన 1987కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. అప్పటి గురువులు జి. సర్వేశ్వరరావు మాస్టర్, టి. అప్పలస్వామి మాస్టర్, కె. రాజారావు మాస్టర్లను ఆ బ్యాచ్కు చెందిన 38 మంది పూర్వ విద్యార్థులు సన్మానించారు. అప్పటి తీపు గుర్తులు, అలనాటి చదువుకు సంబంధించిన విషయాలు, అప్పటి క్రమశిక్షణ వంటివి నెమరు వేసుకున్నారు. సుమారు 38 సంవత్సరాలు తరువాత తమ పాత మిత్రులు కలవటం, మరల తమ గురువులను కలవటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లావుడి వాసు ప్రసాద్, లెంక వెంకటరమణ, కందుల చినరాజు, బాదం మామాజీ, ఎస్. నరసింగరావు పలువురు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE: VIZIANAGARAM
I.A. 550 /2023 IN O.S.43/2018

Between:
Koppisetty Lalitha (died) and others ......Petitioners/plaintiffs
And:
Nadupuri Srinivasa Rao and another ....Respondents/Defendants

TO: -
Respondent -1
Nadupuri Srinivasa Rao, S/o. late Krishna, Duppada Village, Vizianagaram Mandal & District.

NOTICE

Please take notice that the above named plaintiff filed a suit against Respondents/ Defendants 1 & 2, for granting time to deposit as an advance sale consideration amount along with interest, in the meanwhile as per the Honourable Court Order issue notice to the 1st Respondent/Defendant and the same stands posted to **23-7-2024** on that day you have to appear before this Honourable court either personally or through an Advocate by **10.30 A.M** along with your documents, failing which the matter will be decided in your absence as per Law.

MAJJI YOGESWARA RAO,
ADVOCATE,
VIZIANAGARAM

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
O.S.82/2023

Between:
Gorle Krishna ....Plaintiff
And:
Gorle Suryanarayana and another...Defendants

NOTICE

Defendants 1 & 2:
D1: Gorle Suryanarayana, S/o.late Sanyasi @ Sanyasi Naidu, Hindu, aged about 83 years, Bheemali Village, Lakkavarapukota Mandal, Vizianagaram District.
D2: Gorle Ravi Babu @ Ravi kumar, S/o. Suryanarayana, Hindu, aged 43 years, Sri Sai Nilayam, Opposite Sarada Mahila Samajam, Harbor Park, Visakhapatnam-530003.

Please take notice the above plaintiff filed the above suit against you for cancellation of Regd., Partition Deed, dt.21.089.2007 bearing Document No:3574/2007 and consequentially directing the Sub-Registrar, Kothavalasa to make a note for cancellation of the said document and for passing of the Preliminary decree and directing the partition of the schedule property into 3 equal shares and to allot one such share to the plaintiff and the above suit is posted to 29.07.2024 for your appearance before the above Honourable court at 10:30 AM either personally or through an Advocate duly authorized by you. If you fails to appear before the above court on **29.07.2024 at 10:30 A.M.** the matter will be decided in your absence as per the records available on record.

K.B.PARAMESWARA RAO
Advocate for Plaintiff Vizianagaram
Cell: 9440738336

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు విజయనగరంలో
O.S.92/2017

Raparthi Suryanarayana and others. .....PLAINTIFFS
Vs.
Melastri Atchemnaidu and others. .....DEFENDANTS

To
D.13 Melastri Mahalakshmi, W/o. late Sriramulu, aged about 65 years, Hindu, R/o. Kothavlasa village and mandal, Vizianagaram district.
D.14 Melastri Sujatha, W/o. late Srinu, aged about 35 years, Hindu, rest-do-
D.15 Melastri Ganesh, W/o. late Srinu, aged about 20 years, Hindu, rest -do-
D.16 Melastri Dhanalakshmi, D/o. late Srinu, aged about 20 years, Hindu, rest-do-.

పై నంబరు గల దావాలోని వాదులు మీపైని మరియు యితరులపై, పైన పేర్కొన్న కోర్టు లో డిక్లరేషన్ దావాను వేయగా, అందు మీకు ఎన్ని పర్యాయములు కోర్టు నుండి సమనులు పంపినప్పటికినీ మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక పోవడంవలన, శ్రీ కోర్టువారు ఈ పత్రికా ముఖముగా మీకు సమనులు పంపుటకై ఆదేశించి, మీ హాజరుకై సదరు దావాను తే.30.07.2024 నాటికి వాయిదా వేసియున్నారు. కావున **తే. 30.07.2024 దీన, ఉదయం గం.10-30** లకు మీరు స్వయముగా గాని, లేక మీ వకీలుద్వారా గాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ వాదనను వినిపించుకొనవలెను. లేనియెడల లభ్యమగు రికార్డుల మూలముగా మీ పరోక్షములో తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆదేశములతో ప్రచురించడమైనది)

కె. కృష్ణమూర్తి,
ఎస్.ఎస్.ఎస్.వి.రామచంద్రరావు,
వాదులతరపు న్యాయవాదులు,
కూరెళ్ళవారి వీధి, కొత్తపేట
విజయనగరం - 535002.